# అల్లుడి ఆక్రోశం

ప్రకాశం కారు దిగుతూనే "ఏమనుకోకోయ్. ఈ రోజు ఆఫీసు వర్క్ ఎంత తెముల్చుకుందామన్నా కుదరలేదు. బాగా ప్రొద్దుపోయింది, తొందరగా వెళ్ళిపో. ఇంటి దగ్గర మా ఆవిడలేదు. పిల్లల్ని కాస్త చూసుకోవాలని అన్నావుగా" మధుకర్ చేతుల్లోని హాండు బ్యాగు అందుకుంటూ అన్నాడు.

"మీకెందుకు సార్ శ్రమ. లోపలికి వచ్చి అమ్మగారిని పలకరించి ఆ చల్లని చేతితో టీ తాగి కాని నేను ఎలాగూ వెళ్ళను. దూరాన ఉన్న మా అన్నావదినలను పెద్ద మనసున్న మీ ఇద్దరిలో చూసుకుంటున్నాను. ఇంకా మీరు వేళకు ఇంటికి పంపలేక పోయానని, అమ్మగారూ, అమ్మాయిగార్లూ ఏవో పనులు చెప్పి హడలు కొట్టేస్తున్నారని నాకు సంజాయిషీ ఇవ్వడం ఏం బావోలేదు సార్!! అంటూ తనే ముందు ఇంట్లోకి నడిచాడు.

"అలా కూర్చోమధూ. ఒక్క క్షణంలో టీ తీసుకువస్తాను. వంటింట్లోకి వెళ్ళింది ప్రమీల. డ్రస్ మార్చుకొని బాత్ రూమ్ వైపు వెళ్తున్న భర్తను ప్రశ్నించబోయింది. ఆమె గొంతు పెగిలితేగా. మధుకి టీ అందిస్తూ నెమ్మదిగా అడిగింది.

"మీ అయ్యగారు చెక్కుతెచ్చారా, కాషే తెచ్చేశారా" మధు నిట్టూర్చాడు.

"అయ్యగారు బ్యాంకుకి వెళితేగా ఏదైనా తేవడానికైనా." ప్రమీల అదిరిపడింది.

"అమ్మో చంపేశారే. అర్ధరాత్రికే అల్లుడు ప్రత్యక్షమౌతాడే" "అయితే తొందరగా ఒకసారి ఇంటికి వెళ్ళి వచ్చేస్తాను. స్టేషనుకు వెళ్ళి అతగాడికి ఏ ఇబ్బంది కలగకుండా తీసుకొచ్చేస్తాను." ఖాళీ కప్పు టీపాయ్ మీద పెట్టి దిగ్గున లేచాడు.

"అది సరే దినకరు వస్తున్నది అత్తమావల మీద అపేక్ష పొంగి కాదుగా. తెల్లవారే సరికి యాభైవేలు ముట్టచెప్పక పోతే తోక తొక్కిన త్రాచు అవుతాడు. వట్టి చేతులతో కనక పంపామంటే పిట్టి తల్లిని కాల్చుకుతినడా!" ఆమె కళ్ళలో దయనీయంగా కూతురు రూపం మెదిలింది. భర్త భోంచేస్తుంటే భయంగానే విషయం కదిపింది.

"అల్లుడు ఫోన్ చేశాడు. పన్నెండు గంటల ట్రైన్‌కే వస్తాడట. మీరు బ్యాంకుకి వెళ్ళడం"

"కుదరలేదు. ఏం కోపం మునుగుతుంది" భార్య మాటను పూర్తి చేసిన అతని గొంతులో రవ్వంత విసుగు.

"సరిపోయింది. మీరిలా నిమ్మకు నీరెత్తినట్టు ఉంటారు. ఆ మహానుభావుడు అనుక్షణం అమ్మాయిని వేపుకు తింటాడు. మధ్య నా మనసు నలిగిపోతోందండీ" ఆమె కళ్ళలో నీళ్ళు చిందాయి.

"ఓసి పిచ్చిదానా! ఇంత మాత్రానికే ఏమైపోతుంది. దినకర్‌కు మనం డబ్బు ఇవ్వం అనలేదుగా. ఒక్కరోజు ఓపిక పట్టమందాం. అల్లుడ్ని సరాసరి బ్యాంకుకి తీసుకువెళితే సరి." భార్య బాధపడటం ఒక్క క్షణం కూడా చూడలేదు ప్రకాశం.

దినకర్ ట్రయిన్ దిగుతూనే " అరే ఇంత రాత్రి ఎందుకొచ్చావోయ్. ఏ ఆటోలోనే రాకపోయే వాడ్నా?"

"అలా ఎలా కుదురుతుంది. మీది అల్లుడి హోదా కదూ!" మధుకర్ మాటలో వ్యంగ్యోక్తికి రవ్వంత నొచ్చుకున్నాడు దినకర్.

"అత్తయ్యగారూ మామయ్యగారూ ఏమైనా?" నసిగాడు కారులో కూర్చుంటూ "కాళ్ళుకడిగి కన్యాదానం చేసిన వాళ్ళు. ఏమైనా అనుకునే అర్హత వాళ్ళ కెక్కడిది. మీరు వచ్చిన పని లక్షణంగా జరిపించి మరీ పంపిస్తారులేండి. అల్లారు ముద్దుగా పెంచుకున్న అపురూపాల కుందనపు బొమ్మ కదా. అందుకనే మీ ఆటలిలా సాగనిస్తున్నారు." అంటూ దినకర్ కళ్ళలోకి తీక్షణంగా చూసి కారు స్టార్ట్‌చేశాడు.

దినకర్ ఒక వేడి నిట్టూర్పు విడిచి కుందనపు బొమ్మ అనుకున్నాడు. అసలు విషయం తెలియని మధుకర్ ఇలా తనని దెప్పిపొడుస్తున్నాడు. నిజానికి తను ఈ ఇంటి అల్లుడయింది వీళ్ళ సంపద మీద ఆశతో కాదు. నాన్న ఈ కుటుంబ సాంప్రదాయాన్ని గురించి అందరిలోనూ ప్రతిఫలించే మంచి మనస్సుల గురించి చెపితే కమల సహచరి అయితే సంసార జీవితం ఏ ఒడుదుడుకులు లేకుండా ప్రశాంతంగా సాగిపోతుందని సరే అన్నాడు. కట్నం విషయం తనేమీ పెద్దగా పట్టించుకోలేదే. " మీరేమిచ్చినా మీ అమ్మాయి పేర బ్యాంకులో ఉంటుంది. నిజానికి నాకిలాంటివి కిట్టవు" అనేశాడు. తన తండ్రి ఎప్పుడూ తన ఇష్టానికి వ్యతిరేకి కాదు. ఇరు పక్షాల

వారూ బాగా ఉన్నవాళ్ళే కావడంతో పెళ్ళి చాలా ఆర్భాటంగానే జరిగింది. కమల కాపురానికి వచ్చేసరికే తను అన్నీ అమర్చేశాడు. దేనికోసం వెతుకులాడవలసిన పనిలేదు. అయినా కమల తీరే వేరు. అందరి ఆడపిల్లలా కాక పుట్టింటి నుండి ఏదో ఒక రూపంలో రాబట్టుకోవాలని తన భర్త అల్లుడి దర్జా దర్పం చెలాయించాలని పట్టు పట్టేది. ఆ ధోరణి కిట్టేది కాదు తనకి

"చూడు కమలా. మనమేం లేని వాళ్ళం కాదు. అదీకాక మీపుట్టింల్లో డబ్బు గుట్టలు పడి ఉందని భ్రమలో పడుతున్నావేమో. మీ వాళ్ళకి కొద్దో గొప్పో ఆస్తి ఉందనుకున్నా. మీ నాన్న పెద్ద ఆఫీసరే అయినా నీ తరవాత ఇద్దరు చెల్లెళ్ళు ఉన్నారు. వాళ్ళ బాగోగులూ చూడాలి కదా! వాళ్ళకీ నాలాగే అన్ని ముద్దూ ముచ్చట్లు జరగాలి కదా!

"అదేనండీ నేననేదికూడా. అందరూ మీలా అత్తమామల పట్ల సానుభూతి కురిపిస్తూ ఆ ఇంటి భవిష్యత్తే ఆలోచిస్తూ కూర్చుంటారా. మీరన్నట్టు ఆ ఇంటికి అల్లుళ్ళమంటూ మరో ఇద్దరు తయారయేలోగానే ఏదో ఒక మిషతో కాస్తో కూస్తో తెచ్చిపడేసుకోవాలి. ఇప్పుడు మనకి అవసరమా! అయ్యో అత్తమామల్ని అవస్థపెట్టాలి అని ఆలోచిస్తూ కూర్చుంటే. అమ్మో మా చెల్లిళ్ళు చాలా గడుసువాళ్ళు ఉన్నదంతా ఊడ్చుకుపోతారు."

"పోతే పోనీ వాళ్ళు సంతోషంగా ఇచ్చేదే మనకి చాలు. వేధించి సాధించి అత్తమామల్ని కొరుక్కుతినే అల్లుళ్ళ జాబితాలో చేరను" నిష్కర్షగానే చెప్పాడు. కమల వింటేనా! పెళ్ళికి ముందే తనకున్న కారు అమ్మించేసింది. ఓ లక్ష తనచేతే అడిగించి మరీ కొత్తకారు కొనిపించింది. ఇంట్లో రెండు గదులకి ఏ.సి ఉండి తీరాలని. డాబాపైన రెండుగదులు వేయించాలనీ ఇలా దేనికోదానికి మామగార్ని పీడించేదాకా వదిలిందా! తనకు దశమగ్రహం అనే పేరు తెచ్చిపెట్టింది. పెళ్ళయిన రెండేళ్ళకీ తనచేత మామగార్ని పీడించి ఆరులక్షలు దాకా రప్పించుకుంది. ఆఫీసులో అయితే బల్లకింద చెయ్యిపెట్టను అనేనీతికి కట్టుబడి ఉండగలిగాడు కానీ తన అర్ధాంగి ముందు ఓడిపోయాడు. అత్తమావలంటే తనకీ ఆత్మీయతా గౌరవభావం ఉన్నా అవి భార్య కోరికల మేరకు మరుగున పడిపోయాయి. అతను ఓ పెనుభూతంలా కనిపిస్తున్నాడు వాళ్ళ కళ్ళకి. భయంతో గజగజలాడుతూనే మర్యాదలు జరిపిస్తారు. మరదళ్ళు తనను ఏవగించుకుంటూ " లక్షలకోసం పుస్తెకట్టే ఇలాంటి ప్రభుద్ధుల్ని మేం చస్తే చేసుకోం. మాకు రాబోయే శ్రీవారులైనా అమ్మానాన్నలకి కుడిబుజంలా ఉండాలి. కొడుకులు లేని కొరత తీర్చాలి." అని మాటల సందర్భంలో అంటూ ఉంటారు. నిజానికి తనదీ ఆ స్వభావమే. అందుకనే వాళ్ళు ఇలాంటి వాగ్బాణాలు సంధించినప్పుడుతన మనసు తీవ్రంగా గాయపడుతుంది. విషయమంతా వివరించి చెప్పేయాలని ఎన్నోసార్లు అనుకున్నాడు. పెదవి దాటితే ప్రణయ సుందరి ప్రళయ చండిక అవుతుందని ఆ ప్రమాదం కొని తెచ్చుకోలేదు. కానీ ఇక లాభంలేదు. ఈ రెండేళ్ళుగా ఈ అంతర్మథనం తనలోనేనా.

కమల మాట కాదంటే తనకి క్షణక్షణం లేని పోని రగడలతో శాంతి లేకుండా చేస్తుందని ఇన్నాళ్ళూ సహించాడు. ఈ ఆవేదన కంటే భార్య సృష్టించే అశాంతే నయం. దినకర్ మనసులో మెరుపులాంటి ఆలోచన. అంతే.

"ఇక్కడ ఓ సారి కారాపు" బిగ్గరగా అన్నాడు. మధుకర్ అయోమయంలో పడ్డాడు. ఇంత రాత్రివేళ ఇంటి దరిదాపులకి వచ్చేశాక ఇలా అంటాడేంటి? అనుకుంటూ కారుని ఓ ప్రక్కకి ఆపు చేశాడు.

"ఏమోయ్ మధుకర్ నీకు నేను ఎగతాళిగా కనిపిస్తున్నాను కదూ. లోగుట్టు పెరుమాళ్ళ కెఱుక అంటారిందుకే" తనూ ఫ్రంట్ సీట్లో కూర్చుంటూ మధుకర్ ముఖంలోకి చూస్తూ అన్నాడు.

"గుట్టూ మట్టూ కేముంది. మగాడుగా పుట్టినవాడు ఇదొక హక్కు అనుకుంటున్నాడు. మీరూ ఆ కోవకి చెందిన వారు సార్" ప్రాణస్నేహితుడైన మధుకర్ సార్ అంటూ నొక్కి పలకడం మరింత బాధ అనిపించింది.

"నువ్వు నన్నిలా సార్ సార్ అనడం ఏం బాలేదు." మధుకర్ ఏదో అనబోయేంతలో మళ్ళీ తనే అందుకున్నాడు. "నువ్వు నన్ను పూర్తిగా అపార్థం చేసుకున్నావ్. అందుకు కారకుడ్ని నేనే. ఇంతవరకూ ఒంటరిగా ఈ అలజడి భరించాను. ఇక నా వల్ల కాదు."

మధుకర్ విస్తుబోయాడు "అంటే?"

"అదే నువ్వయినా ఆ కృష్ణ భగవానుడిలా నాకు కర్తవ్య భోద చేస్తావని నేను ఎదుర్కొంటున్న పరిస్థితి నీముందుంచాలనుకుంటున్నాను." చనువుగా స్నేహితుని భుజం మీద తల ఆనించాడు.

"అరే మన మధ్య దాపరికాలేమిటోయ్. నీ మనస్సుని పిండేస్తున్న ఆ రహస్యమేదో నా ముందుంచు." స్నేహితుని తల నిమురుతూ ఆప్యాయంగా అన్నాడు.

మధుకర్ కరస్పర్శకి అతడు లాలనగా అడిగిన తీరుకి దినకర్ పులకాంకితుడయ్యాడు. వాళ్ళ స్నేహబంధం అలాంటిదేమరి. బి.కాం. చదువుతున్న మూడేళ్ళూ ఒకే రూంలో ఉన్నారు. దినకర్‌కు హాస్టల్ తిండి సరిపడకపోతే మధుకర్ వండిపెట్టేవాడు. " ఇన్ని రకాలు ఇంత రుచిగా కష్టపడి చేసిపెడుతున్నావు. నా మూలానా నీ చదువు చెడిపోతోందిరా" అని దినకర్ అంటే "ఈ శాకపాకాల్లో నాకూ భాగముందిగా అయినా ఏ రాత్రి అయినా చదువుకోవద్దన్నదెవరు? నువ్విలా నా చేతి వంటకాన్ని మెచ్చుకుంటూ తింటూంటే అబ్బ భలే సంబరంగా ఉంది" అనేవాడు.

"అయితే ఓ పనిచేయ్. నువ్వు ఎలాగూ మునిగి తేలుతూ కాస్త టైం దొరికిందో గుళ్ళూ గోపురాలంటూ తిరుగుతావ్. అందుకే దేవుడ్ని ఓ వరం అడిగేయ్. హఠాత్తుగా స్త్రీ మూర్తివై పోయి నా అర్ధాంగిగా మారిపో. అంటూ కొంటెగా అల్లరి చేసేవాడు.

బి.కాం పూర్తికాగానే ఇద్దరూ బాంకు పరీక్షలు రాశారు దినకర్ బాంకు ఆఫీసర్ అయిపోయాడు గాని మధుకర్ నిరుద్యోగిగానే మిగిలాడు. చిన్నప్పుడు సరదాగా నేర్చుకున్న కారు డ్రైవింగ్‌ని జీవనోపాధిగా మార్చుకున్నాడు. చిత్రంగా ఇప్పుడిద్దరూ ఒకే ఇంట్లో కలుసుకున్నారు. ఆకుటుంబానికి మధుకర్ ఆప్తుడు. ఆ ఇంటల్లుడుగా అడుగుపెట్టిన దినకర్‌కి అతను ప్రాణమిత్రుడు. ఇంకేం ఎవరి బాధ్యతల్లో వాళ్ళుపడి చెలిమిజలాన్ని చిలకరించి పెంచడం మానేసిన ఆ స్నేహలత తిరిగి చిగురించింది. దినకర్ ఆదర్శానికి తిలోదకాలిచ్చాడని, ఆర్థికంగా ఏలోటూ లేని అతడు ఆత్మాభిమానాన్ని కోల్పోయి అందరి మోస్తరు గానీ అల్లుడ్ని సుమా అంటూ అత్తమామలపట్ల వ్యవహరిస్తున్నాడని అవగతమయ్యే సరికి పూత కొచ్చిన ఆ స్నేహలతకి చీడ పట్టింది. దినకర్ భావాలు మధుకర్ మెదడును పురుగుల్లా తొలిచేస్తున్నాయి. మానసికంగా దినకర్‌కి పూర్తిగా దూరమైపోయాడు.

ప్రకాశం దంపతుల పట్ల అపారమైన జాలి అతనిలో చోటు చేసుకుంది. వాళ్ళు ప్రాణప్రదంగా పెంచుకున్న కూతురు భర్త వల్ల ఎన్నో కష్టాలనెదుర్కుంటుదనే బాధ, దినకర్ ఎదార్థం కాస్తా బయటపెట్టేసరికి విస్తుపోయాడు.

" ఈ నిజం నా ఊహకందలేదురా. అల్లుడంటే అత్తవారింట కొత్తగా చేరిన ఓ కుటుంబ సభ్యునిలా కలసిపోయి వాళ్ళ కష్టసుఖాల్లో పాలుపంచుకోవాలని టీవీగా మర్యాదల కోసమే పట్టుపట్టి అధికార దర్పం చూపించటం సంస్కారం అనిపించుకోదని, కట్నకానుకలు కోరుతూ వేధించుకు తినకూడదని ఇలా ఇలా ఎన్నో ఆదర్శాలు వల్లించే నువ్వు పెళ్ళికాగానే హఠాత్తుగా గొంతెమ్మ కోరికలు మొదలు పెట్టావంటే నమ్మలేక పోయానురా. కీలకం ఇక్కడుందన్నమాట. పిచ్చి సన్నాసి. ఆశ ఆవిడది చెడ్డపడింది నువ్వు. సరేలే ఇప్పటికైనా విషయం నాదాకా వచ్చిందిగా. ఇక నీకీ మనస్తాపముండదు."

మిత్రుడి మాటలకి నిండుగా ఊపిరి పీల్చుకున్నాడు దినకర్. మధుకర్ అంతా వివరించి చెప్పేసరికి ఒక్కసారిగా షాక్ తగిలింది కమల తల్లిదండ్రులకి. కన్నవారితోనే అనుబంధం బిడ్డలకు ఇంతగా డబ్బుతో ముడిపడిందా. ఏం లోటు చేశాదని కమల ఇలా నాటకమాడాలి. అయితే తనసుకున్నట్టు కంట్లో నలుసుపడినా తల్లిగా తల్లడిల్లిపోయేది. ఎన్ని కల్లబొల్లి కబుర్లు చెప్పింది. భర్త తనని బతకనివ్వడం లేదంటూ ఎంత ఏడుపు నటించింది. బిడ్డల సుఖమే తమ సుఖమనుకునే సహజ స్వభావంతో దాని కాపురంలో కలతలు రాకూడదని అడిగినప్పుడల్లా లక్షల కుమ్మరించాం. దంపతులిద్దరిలోనూ ఈ మోస్తరు ఆలోచనలే. అల్లుని ఆక్రోశం వాళ్ళ చెవుల్లో గింగురుమంటోంది. ఇంక దీని నాటకానికి తెరపడాలి. ఈ ఆటలు కట్టించాలి. ఇద్దరూ ఓ నిశ్చయానికి వచ్చారు.

"మమ్మల్ని క్షమించు బాబు. మా అమ్మాయిలో ఇంతగా స్వార్థం పేరుకుపోయిందని తెలుసుకోలేకపోయాం." ప్రకాశం దినకర్ చేతులు పట్టుకున్నాడు. నీతో మేమూ బయలుదేరుతున్నాం. దాని పొరపాటు అదే సరిదిద్దుకునేలా చేయటం తల్లిగా నా బాధ్యత. అల్లుడ్ని అప్యాయంగా చూసింది ప్రమీల.

భర్త వెనుకే కారుదిగి వస్తున్న అమ్మానాన్నలని చూస్తూనే అవాక్కయింది కమల.

"అలా చూస్తావేమే. మమ్మల్ని లోపలికి రానివ్వవా" అంటూ ఇంట్లోకి దారితీసింది ప్రమీల.

తల్లిదండ్రుల ముఖాల్లో ప్రసన్నత లేకపోవడం కమల కనిపెట్టింది. ఆమె మనసు భయంతో రెపరెపలాడింది. ఇదంతా తన వల్లే జరుగుతుందనే నిజాన్ని భర్త కనక చెప్పేసి ఉంటే అనుకున్న కమల భర్తని నిలేసింది.

అయితే దినకర్ దోషిలా తలొంచలేదు.

"నా మనోభావాలకు విరుద్ధంగా ఎన్నాళ్ళని ప్రవర్తించను" అందుకనీ దాపరికం లేకుండా ఉన్నది ఉన్నట్టూ చెప్పేసి నన్ను చులకన చేయాలా.

"ఇందులో చులకన అయ్యేదేముందమ్మా. మేము నిన్ను కన్నవాళ్ళమే కాని పరాయివాళ్ళం కాదు."

"మాటిమాటికి అతని చేత ఏదో మిషతో అడిగించి అల్లుడ్ని చులకన చేశావు. ముందు నువ్వే నీ ధోరణి మార్చుకో." మందలింపుగా అంది ప్రమీల కమలలో వివేకం తల ఎత్తింది.

తన భర్తలాంటి వ్యక్తిత్వం ఎందరికుంటుంది. ఇన్నాళ్ళూ తను ప్రవర్తించిన తీరుకి తనలో తనే కుంచించుకుపోయింది.

"మీ అందర్నీ మన్నించమని అడిగే అర్హత కూడా నాకు లేదు. ఇక నుండి నా భర్త ఆదర్శాలే నావిగా అతని అర్థాంగిగా నడుచుకుంటాను" అంది స్నేహితుని పుణ్యమా అని తమ ఇద్దరి మధ్యా అరమరికలు తొలగిపోయాయి. ఇక అత్తమామల అనురాగం మరదళ్ళ మమకారం పుష్కలంగా లభిస్తాయి తనకి. మధుకర్‌కి మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకున్నారు.

*15 -04 -2001 ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం నుంచి ప్రసారం* ❑